# ఉత్తరం



అనామకుడు

**భ**యానకమా ?
**ఆహ్లాదకరమా ?**
**ఉద్విగ్నభరితమా ?**
**నిరీక్షణామయమా ?**
**ఏం చెప్పను ఈ దృశ్యాన్ని గురించి ??**
**ఏం చెప్పను ఈ నాలుగ్గోడల మధ్య ప్రపంచాన్ని గురించి?**

ఇది కలో, మెలకువో అర్థంకాదు.

మెలకువలో కలల కలవరం, కలలో రేపటి మెలకువల కువకువలు.

పూలు, నీడలు, ధూళీ, నీళ్ళూ, మనిషీ, శ్రమా, పాటా, కన్నీళ్ళూ.... అయినా ఒక మౌనం. ఆత్మచుట్టూ ఒంటరితనం. హృదయంచుట్టూ ఒంటరితనం. ఒక సుదీర్ఘ నిశ్శబ్దం.

ఇక్కడ నెలలు, సంవత్సరాలు పాములు జర జర లాడినట్టు వస్తుంటాయి. గుండెల వాడలనుండి అపరిచితు డెవరో నిష్క్రమించినట్టు రోజులు వెళ్ళమారుతుంటాయి.

గొంతు చించుకుంటూ గంటలు. గాయాల్తో పడివుంది పక్షి. గుమికూడిన నక్షత్రాలు. దివారాత్రుల దారులమీద పాకుతున్న తేదీలు. ఇక్కడ కళ్ళు అన్వేషిస్తాయి. హృదయాలు అన్వేషిస్తాయి. అయినా కనిపించవ్ పదచిహ్నాలు. మరపుల మడతల్లో నలిగిన జీవన పుష్పగుచ్ఛాలు. ఆకుల రెప్పలపై మంచుబొట్ల మిలమిలలు. సరుగుడు చెట్లమీద రెక్కలు ఆరేసుకుంటుంది ఎండ. నవ్వుతూ చందమామ. నక్షత్రాల చిరునవ్వులు. చంద్రుడినుంచి చిందుతున్న వెన్నెల.

అయినా-

ఈ జైలు వాతావరణంలో ఏదో ఒక అంధకారం. ఇసుకలో పడి పాలు ఇంకిపోయినట్లు వెలుగు చెక్కిళ్ళపై కోటానుకోట్ల చీకటిగోళ్ళ గాట్లు....

''అన్నా.... అన్నా !....'' తట్టి పిలుస్తున్నాడు కరీం. ఆలోచనల్లోంచి తేరుకొని ఏంటన్నట్టు చూశాను.

''ఏందే కేసెటేస్తున్నవ?'' నవ్వుతూ అడిగాడు కరీం. చిన్నగా నవ్వి లేదన్నట్టు తలూపాను. ఉన్నట్టుండి ఆలోచనల్లోకి వెళ్ళిపోవడాన్ని, ఒంటరిగా కూర్చొని మౌనంగా ఉండడాన్ని 'క్యాసెట్ వేయడం' అని పేరు పెట్టారు మావాళ్ళు.

లేచి నిలబడ్డాను.

''అన్నా రిలేఫాస్ట్ మొదలైతందే.... మన బ్యారక్‌నుండి యాదన్న, సిద్ధిక్‌లు కూర్చుంటు న్నారు'' చెప్పాడు కరీం.

''యాదన్నా'' ఆశ్చర్యంగా అడిగాను.

''ఔ''

యాదన్నజైలుకొచ్చి మూడ్నెల్లయింది. రైతుకూలీ. చదువు రాదు. మెదక్ జిల్లా సిద్ధిపేట దగ్గర ఓ పల్లె. ఫక్తు తెలంగాణా పల్లె. బ్యారక్కులో వున్న అందరిలోకీ పెద్ద వయసు. యాదన్న కొడుకు పార్టీలోకి వెళ్ళాడంట. అప్పట్నించీ పోలీసులు రోజూ ఇంటిమీద దాడిచేసి 'మీ కొడుకేడున్నడు' చెప్పండంటూ కుటుంబ సభ్యులందర్నీ చిత్రహింసలు పెట్టడం మొదలైంది. చివరికోరోజు యాదన్నను పట్టుకుపోయి పోలీసు స్టేషన్లో పెట్టి కొడుకు ఆచూకీ కోసం ఇరవై అయిదురోజులు తీవ్ర చిత్రహింసలు పెట్టి, చివరకు రెండు అక్రమ కేసులు

బనాయించి జైలుకు పంపారు. పెద్ద వయసు, భార్యాబిడ్డలు, సంసారం వున్నవాడు కావడం, జైలుకు రావడం యిదే మొదటి అనుభవం కావడంతో బాగా దిగులుపడిపోయాడు. పైగా వళ్ళంతా పోలీసులు కొట్టిన దెబ్బలు. జైలు డాక్టర్లతో మాట్లాడి హాస్పిటల్‌కి పంపితే చెయ్యి విరిగిందని కట్టు కట్టి పంపించారు. గాయం ఇంకా నయం కాలేదు, కట్టు ఇంకా అలానే వుంది. కాసిని రోజులు ఎవరితో కలవలేకపోయాడు. ఒంటరిగా కూర్చొని దిగులు పడేవాడు. సందడి సందడిగా వుండే ఉత్సాహభరితమైన జైలు కమ్యూన్ వాతావరణంలో క్రమంగా కోలుకున్నాడు. కోలుకోవడమే కాదు జైలు పోరాట కార్యక్రమాల్లో పాల్గొనేంతగా ఉత్తేజితుడయ్యాడని దీంతో అర్థమౌతుంది.

బ్యారక్కుల మధ్య వుండే ఖాళీస్థలానికి చేరుకున్నాం. అక్కడంతా కోలాహలంగా వుంది. దాదాపు అరవైమంది జైలు కమ్యూన్ సభ్యులందరూ ఒకరివెనుక ఒకరు బారులు తీరి నిలబడ్డున్నారు. మేంకూడా వారితో జేరాం. ..

సిద్ధంచేసిన జెండాలు పైకిలేచాయి. బ్యారక్కు గోడలవతలి సాధారణ ఖైదీలకు, జైలు సిబ్బందికి కనపడేలా.

బ్యారక్ గోడల పక్కన ఊరేగింపు మొదలయ్యింది.

"జైల్లో అమలవుతున్న పాశవిక నిర్బంధకాండను ఖండించండి".

"చంద్రమౌళి మరణంపై న్యాయ విచారణ జరపాలి."

"సంబంధిత అధికారుల్ని శిక్షించాలి".

"జైల్లోపల ఖైదీలపై లాఠీఛార్జి చేసిన సివిల్ పోలీసులపై చర్య తీసుకోవాలి."

"జయప్రదం చేయండి రిలే నిరాహార దీక్షల్ని."

నినాదాలు పిక్కటిల్లాయి.

ఉద్వేగం ఉప్పొంగింది.

రణరంగం మధ్యనున్న అనుభూతి.

ఊరేగింపు. యుద్ధకవాతు.

కదం తొక్కుతున్న కామ్రేడ్స్!

పైకి లేస్తున్న పిడికిళ్ళు

కామ్రేడ్స్ సమరోత్సాహం.

ఎవరు వీళ్ళు ?

ఎవరీ ఖైదీలు ?

ఏ లోకంనుంచి వచ్చారు ??

ఈ రాతిగోడల మధ్య యుద్ధాన్నిరాజేస్తున్నారు!

చలితో గడ్డకట్టిన వాతావరణానికి విద్యుత్ ఊపిర్లూదుతున్నారు.

గోళ్ళల్లో మేకులు, విరిగిపోయిన ఎముకలు, లేలేత తనువులపై గాయాల వస్త్రాలు, మెరిసే చెక్కిళ్ళపై నెత్తుటి చారికలు. కన్నీళ్ళు-మంటల చుక్కలు. శ్వాస-ఒక సుడిగాలి, మాట-తుఫాను. కనుబొమల కదలికలో సంకల్పం చిర్నవ్వులు. చూపుల కంపనలో ఆశయాల అలజడి. నుదుటి ముడతల్లో పోరాటం అడుగుజాడ. నరకయాతనల్లోంచి నవ్వులు, బాధల్లోంచి పాటల పల్లవులు.

అణచివేత నానాటికీ పెరిగిపోతుంది. విషం ఇంకా పైపైకి ఎక్కిపోతుంది. శత్రువు దౌష్ట్యం మితిమీరిపోతుంది. జులుం వెర్రి కేకలేస్తుంది.

అయినా వీళ్ళు-

పెదవులు కదల్చరు. తలలు వంచరు. నిట్టూర్పుకు బదులు ఒక నినాదం-

"విప్లవం వర్ధిల్లాలి!"

వీళ్ళు ఈ నేలతల్లి బిడ్డలు. పంటచేల పాలికాపులు. కార్ఖానాల చేతులు. విప్లవాల రెక్కలు. డేగ కంటిచూపులు. బండరాళ్ళ కరుకుజైల్లో, సుడిగాలుల దారుల్లో, పిడుగుల జడివానల్లో తుపాకీగుళ్ళ తుఫానుల్లో తలయెత్తుకు కూర్చున్నవాళ్ళు!

వీళ్ళంతా ఒక పెట్టున గర్జిస్తే ఈ హృదయంలేని రాతి గోడలు పెళ్ళలు పెళ్ళలుగా రాలిపడతాయి.

బ్యారకు గోడ పక్కగా బ్యారకు చుట్టూ నాలుగు చుట్లు తిరిగింది ఊరేగింపు. నినాదాల హోరుకు జైలంతా వజ వజ లాడింది. బ్యారకు గేటు దగ్గర వార్డర్లు. జైలు అధికార్ల హడావిడి.

అంతా తిరిగి బ్యారక్‌కు చేరుకున్నాం. అందరం కూర్చోగానే కరీం లేచి నిలబడి అందర్నీ ఉద్దేశించి మాట్లాడటం ప్రారంభించాడు.

"కామ్రేడ్స్! ఏ విచారణా లేకుండా జైళ్ళలో ఒక్కరయినా మగ్గుతున్నంతకాలం, విచారణ తంతు పేరిట న్యాయం గేలి చేయబడుతున్నంత కాలం ఈ దేశంలో ప్రజాస్వామ్యం వుందని భ్రమపడకు, చదువు, సంస్కారం, సభ్యత వున్నవని నమ్మబోకు! మనిషినీ, మానవత్వాన్ని అవమానించడాన్ని సహించకు!" అన్నాడో కవి. నిజం అమానవీయ నిలయాలైపోయిన ఈ జైళ్ళల్లో ప్రతిఘటన మొదలైంది. అణువణువునా యుద్ధాన్నే జీర్ణించుకున్న సైనికుడికి ప్రతి చోటా యుద్ధరంగమే, అను నిత్యం విముక్తి గీతాన్నే ఆలపించే స్వేచ్ఛాసమర యోధుని ప్రతీగానం స్వేచ్ఛకోసమే. ఇప్పుడీ బందిఖానాలు కలల బృందావనాలు కావు. ఇప్పుడీ జైళ్ళు స్తబ్ధతా నిశ్శబ్ద నిలయాలు కావు. ఈ ఎత్తయిన నాలుగుగోడల మధ్యే ఇప్పుడు రాజీలేని రణరంగం రూపు దిద్దుకుంటుంది. ఈ రోజుకు మన రిలేఫాస్టులు 45వ రోజుకు చేరుకున్నాయి. వరంగల్ సెంట్రల్ జైలులో చంద్రమౌళి అనే ఖైదీని జైలు అధికారులు కొట్టి చంపేసి అనారోగ్యంవల్ల చచ్చిపోయాడని నమ్మించచూశారు. కానీ రాజకీయ ఖైదీల నాయకత్వంలో జైల్లోని ఖైదీలందరూ చంద్రమౌళి మరణంపై సమగ్ర న్యాయ విచారణ జరగాలని డిమాండ్ చేస్తూ సామూహిక ఆమరణ నిరాహార దీక్షలు చేయడం మొదలెట్టారు. దాంతో జైలు అధికారులు బయటనుంచి సివిల్‌పోలీసుల్ని రప్పించి ఖైదీలపై లాఠీఛార్జీ జరిపించి బలవంతంగా నిరసన దీక్షనుంచి విరమింపచేశారు. ఆందోళనకు నాయకత్వం వహించిన మన కామ్రేడ్స్‌పై పాశవిక నిర్బంధ కాండ అమలుచేశారు. అయినా- అక్కడ ఎగసిన మంట అన్నిచోట్లా అంటుకుంది. రాష్ట్రంలోని జైళ్ళన్నిటా ఆందోళనా కార్యక్రమాలు మొదలయ్యాయి. మన జైల్లో మన కమ్యూనే కాక మిగిలిన సాధారణ ఖైదీలు సైతం నిరసన వెల్లువలో భాగమయ్యారు. మొదట 15 రోజులపాటు సామూహిక ఆమరణ నిరాహార దీక్షలు కొనసాగించాం. దాంతో దిగొచ్చిన జైలు అధికారులు కొన్ని డిమాండ్స్‌కు అంగీకరించారు. మిగిలిన డిమాండ్స్ సాధనకొరకు జరుగుతున్న ఈ రిలేఫాస్టులో మొక్కవోని దీక్షతో పాల్గొంటున్న కామ్రేడ్సందరికీ రెడ్ శాల్యూట్స్! వాడు పూర్తిగా దిగొచ్చి మన డిమాండ్స్ పూర్తిగా ఒప్పుకునేవరకూ ఈ నిరసన కార్యక్రమాలు కొనసాగిద్దాం. యుద్ధం మొదలయింది, తుదికంటా మన పోరాటం కొనసాగిద్దాం. పోరాటం వున్నంతవరకూ, పోరాడాల్సిన అవసరమున్నంతవరకూ మనం పోరాడుతూనే వుందాం. విజయం తప్పదు. మన విజయం ఈ ప్రపంచానికి ఈ భూమ్మీద జైళ్ళనేవే లేని కాలాన్ని వాగ్దానం చేస్తుంది. ఈ రోజు రిలేఫాస్టులో కామ్రేడ్స్ యాదన్న, బాలన్న, శీనన్న, సిద్ధిక్‌లు కూర్చుంటున్నారు."

నలుగురు కామ్రేడ్స్ లేచి లాల్‌సలామ్ చెప్పి ముందుకొచ్చి కూర్చున్నారు.

మరోసారి నినాదాలు మారుమోగాయి.

వాతావరణమంతా ఉద్యమ ఉద్వేగపు విద్యుత్.

యాదన్నవైపు చూశాను. మొఖంనిండా సరికొత్త వెలుగు, ఉత్సాహం, ఏదో సంతృప్తి, విజయం ప్రతిబింబిస్తుంది. వంటినిండా గాయాలతో జైల్లోకి వచ్చి ఇంటిమీద దిగులుతో ఒంటరిగా కూర్చున్న ఆ యాదన్నకు, ఈ రోజు సామూహిక కార్యక్రమంలో పాల్గొంటున్న యాదన్నకు మధ్య ఎంత తేడా ?

అవును జైలు మార్చేస్తుంది, సానబెడుతుంది,

జైలు సాయుధ పాఠశాల, జైలు విప్లవాల ఖార్ఖాన.

చుట్టూ-

రాతిగోడలు

రాతిగోడలు

రాతి బ్యారక్కులు

కొత్తగావచ్చినఖైదీల్ని,పగల్నిరేయిని మింగేసే కొండచిలువల ఆకారాలు.

రాతిగోడలు

రాతిగోడలు

రాతి నేల, రాతి కప్పు, రాతి గూళ్ళు, రాతి నుదురు,రాతికళ్ళు,రాతితలుపులు,రాతివంపులు, రాళ్ళ పంజాల్లో ఉక్కు వూచలు

ఈ ఊచల్లోనే-

ఆశలు, ఆకాంక్షలు, ఆశయాలు, ఆవేశాలు, స్వప్నాలు, స్వప్నఫలాలు, చంద్రుని యవ్వన దృక్కులు, ఎండ ఎండేసుకున్న పసిడి కేశాలు, మేఘాల నీడలు, ఉభయ సంధ్యలూ, సమస్త ఋతువులు ఉరికంబాలెక్కుతాయి.

ఈ చీకటి గోడల్లోనే

ఈ ఉరికొయ్యల నీడల్లోనే

విప్లవం ఊపిరి పోసుకుంటుంది, చీకటి ముళ్ళమీద సూర్యుడు నడుస్తాడు. రాళ్ళ గుండెల్నించి ఎర్రచేతులు మొలుస్తాయి. చేతులో మరిఖడ్గాలో రాత్రి అంధకారంలో దీపం వెలిగినట్టు కాంతు లీనుతున్నాయి- వేళ్ళు !

బ్యారక్కుల మూలల్నించి లేస్తున్న కంపనాలు నిశ్శబ్దం నరాల్లో మోగుతున్నాయి గంటల్లా ! జైలుగంటల్లా!జైలుగోడల్ని బద్దలు కొట్టేరణరంగపు పదఘట్టనల్లా!!

ఈ జైల్లో నక్సలైట్ ఖైదీలు మూడు బ్యారక్ల్లో వుంటున్నాం. ఒకటి పెద్దది. రెండు చిన్నవి. మొత్తం 60 మంది దాకా వున్నాం. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన వాళ్ళు, వివిధ స్థాయిలనుండీ, విద్యార్థులు, విద్యాధికులు, కూలీలు, రైతులు, నిరక్షరాస్యులు, సాను భూతిపరులు అందరూ వున్నారు. అందరూ ఇక్కడ సమానమే. అందరూ కమ్యూన్లో భాగమే. జైలు కమ్యూన్ ఓ క్రమశిక్షణాయుత యుద్ధరంగం. అరెస్ట్ అయినప్పుడు వాళ్ళ ప్రవర్తన, విప్లవంపట్ల వాళ్ళ ఆకాంక్ష, పార్టీపట్ల విశ్వాసం ఎవరికైనా కమ్యూన్లో స్థానం లభించడానికి ప్రమాణీకం. ఉదయాన్నే అయిదున్నరకు లాకప్ తెరుస్తారు. కాలకృత్యాలు తీర్చుకున్నాక బ్యారక్ల మధ్యనున్న ఖాళీస్థలంలో అందరం ఫాల్ ఇన్ అయ్యి 'ఎర్రజెండెర్ర జెండెన్నియలో' పాట పాడటంతో దినచర్య ప్రారంభమౌతుంది. అనారోగ్యంతో వున్న కామ్రేడ్స్ తప్ప మిగిలిన వాళ్ళందరం ఓ గంట వ్యాయామం చేస్తాం. తర్వాత స్నానాదికాలు ముగించాకటీ, టిఫిన్. అనంతరం పేపరొస్తుంది. పేపర్లో ముఖ్యమైన వార్తలు టిక్ చేసి అందరికీ చదివి వినిపిస్తారు. తర్వాత ఎవరికి కేటాయించిన డ్యూటీల ప్రకారం వంటపని, తోటపని, ఆవరణ శుభ్రం చేయటం లాంటి పనులు చేస్తాం. పదకొండు గంటలకల్లా భోజనం. తర్వాత ఓ గంట లీజరు. చదువురాని కామ్రేడ్స్కి పాఠశాల. ప్రస్తుతం ఇప్పుడిక్కడ అరడజనుదాకా పాఠశాలలు నడుస్తున్నాయి. మిగిలినవాళ్ళం ఆ సమయంలో వ్యక్తిగతంగా రాసుకోవడం, చదువుకోవడం లాంటివి చేస్తాం. తర్వాత టీ. అనంతరం రాజకీయ తరగతులు. రోజూ వివిధ అంశాలతో సాయంత్రం నాలుగ్గంటలవరకూ సాగుతాయి. ఓ గంటసేపు వాలీబాల్, కారమ్స్, చదరంగం ఎవరికిష్టమైన ఆటలు వారాడుకుంటారు. తర్వాత స్నానం. ఆరుగంటలకు భోజనం. ఆరున్నరకల్లా మళ్ళీ తిరిగి రాతిగుహల్లోకి లాకప్. లాకప్ అయ్యేముందు తిరిగి అందరం ఫాల్ ఇన్ అయ్యి 'మేలుకోండి పేద ప్రజలారా!' అంతర్జాతీయ గీతం పాడటంతో పగటికి వీడ్కోలు చెప్తాం. ప్రతీ బ్యారక్లోనూ టీ.వీ.లున్నాయి. వార్తలు మాత్రం చూస్తాం. ఆదివారాలు మాత్రం సినిమాలు చూస్తాం. మళ్ళీ నిద్రపోయేవరకూ చర్చలు, అధ్యయనం. ఆదివారం మాత్రం దినచర్య ఇందుకు మినహాయింపు. రాజకీయ తరగతులకు బదులు సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలుంటాయి. పాటలు, నాట్యాలు, కవితా, కథా పఠనాలు. వాయిదాలకు వెళ్ళాల్సిన కామ్రేడ్స్ ఎస్కార్ట్ వస్తే వాయిదాలకు వెళ్ళొస్తుంటారు. జైల్లో మిగిలిన సాధారణ ఖైదీల్ని మాతో కలవనివ్వరు. అయినా ఏదో విధంగా సంబంధాలు పెట్టుకుని వాళ్ళను కూడా జైలు పోరాటాల్లో భాగస్వాముల్ని చేస్తుంటాం. ఈ క్రమశిక్షణాయుత కమ్యూన్, రాజకీయంగా కామ్రేడ్స్ని తీర్చిదిద్దుతుంది. శత్రువు ప్రజల్నించి వేరు చేసి నిర్బంధించడం ద్వారా ఏం సాధిద్దా మను కుంటాడో అది బద్దలు చేస్తుందీ జైలు కమ్యూన్. వ్యక్తిని తిరిగి సామూహిక శక్తిని చేస్తుంది. విప్లవ సైనికులుగా తయారుచేస్తుంది. ఇంతపని, సందడి వున్నా అప్పుడప్పుడూ ఏదో ఒంటరితనం, హోం సిక్నెస్, మౌనం వేధిస్తూనే వుంటుంది. ప్రతీ ఒక్కరికీ ఈ గోడల బయట జరుగుతున్న యుద్ధంలో దూకీ భాగస్వాములం అవ్వాలనే ఆత్రం, ఎదురుచూపు!

ఇక్కడ కొట్టుకుంటున్న ప్రతీ గుండె మాటున మేలుకుంటున్న ప్రతీ స్వప్నం పలవరించే పదమొక్కటే

'స్వేచ్ఛ'

"స్వేచ్ఛ!!"

× × ×

తెల్లారింది.

కమ్యూనంతా సందడిగా దినచర్యలో మునిగుంది.

వాయిదాల కెళ్ళాల్సిన కామ్రేడ్స్ రడీ అవుతున్నారు. ఇంతలో ఎస్కార్ట్ వచ్చినట్టు కబురొచ్చింది. సిద్దిపేట కోర్టు వాయిదాకు వెళ్ళే కామ్రేడ్స్ అందరికీ చేయికలిపి 'లాల్సలామ్' చెప్పి వెళ్తున్నారు. వాళ్ళందరిలో బయటి గాలిని పీల్చుకోవాలన్న ఆత్రుత. వాళ్ళలో యాదన్న కూడా వున్నాడు. చేతికింకా కట్టుంది. భార్యాబిడ్డలు, బంధువులు కలుస్తారన్న ఆనందం కళ్ళనిండా.

"అన్నా ఎల్లొస్తానే" అన్నాడు యాదన్న చేయి కలుపుతూ.

నవ్వి "వెళ్ళిరా" అన్నాను.

బ్యారక్ గేటు తెరుచుకుంది.

మిగిలినవాళ్ళు మామూలు కార్యక్రమాల్లో మునిగిపోయారు. అయినా అందరిలో ఓ నిరీక్షణ. వాయిదాకెళ్ళినవాళ్ళు తిరిగొచ్చేదాకా నిరీక్షణ, వాళ్ళు తెచ్చే పోరు కబుర్ల కోసం, పత్రికల కోసం, వాళ్ళు మోసుకొచ్చే బయటి ప్రపంచం కోసం నిరీక్షణ. ఒక్కోసారి వాయిదాలకెళ్ళిన కామ్రేడ్స్ తిరిగిరారు. తప్పించుకోబోయారని చెప్పి కాల్చి చంపేస్తారు. ఎప్పుడేమౌతుందో తెలియదు. అందుకే ఆత్రుతతో, ఆందోళనతో కూడిన నిరీక్షణ.

లాకప్పయిపోయాక రాత్రి ఎనిమిది గంటలకు వచ్చారు వాయిదాకు వెళ్ళిన కామ్రేడ్స్. అందరం ఆత్రంగా వాళ్ళచుట్టూ మూగాం.

వాయిదాకెళ్ళొచ్చిన కామ్రేడ్స్ ముఖాల్లో తీవ్ర ఆందోళన.

ఏమైందన్న ప్రశ్నల వాన.

ఓ కామ్రేడ్ తేరుకొని చెప్పాడు సిద్దిపేట దగ్గర్లో, రోడ్డుపక్క గుట్టల్లో ఎన్కౌంటర్ జరుగుతుందట. రోడ్డంతా పోలీస్వేన్ల జీపుల హడావిడి. గుట్టల్లోంచి కాల్పులు, గ్రైనేడుల మోతలు, ఇంకా కొనసాగుతున్నదంట ఎన్కౌంటర్. ఏమైంది, ఏమిటీ ఇతర వివరాలేమీ తెలియలేదట.

అందరి గుండెలు బరువెక్కిపోయాయి.

వాయిదాకెళ్ళిన వాళ్ళకోసం తీసిపెట్టిన అన్నం వాళ్ళముందర పెట్టారు. కానీ ఎవరూ సరిగా భోంచేయలేదు. వాళ్ళలో యాదన్న అసలు భోజనమే చేయలేదు.

ఎవరి పక్కలమీదకు వారు చేరారు నిశ్శబ్దంగా.

'నష్టమేమన్నా జరిగుంటుందా ?'

వేదన తొలవటం మొదలెట్టింది.

అందరూ పక్కలమీద మసలుతూనే వున్నారు. ఎవరికీ నిద్ర పట్టడంలేదు.

అర్ధరాత్రి దాహమై లేచి కూర్చున్నాను. నాలాగే ఎవరో కామ్రేడ్ ఆ చివర కూర్చొని వున్నాడు. లేచి నీళ్ళు తాగి ఆ కామ్రేడ్ దగ్గర కెళ్ళాను.

యాదన్న.

"అన్నా నిద్దర్రావడం లేదా ?" అడిగాను.

తలెత్తి చూశాడు. కళ్ళనిండా నీళ్ళు, వేదన, ఆందోళన. యాదన్నది ఎన్‌కౌంటర్ జరుగుతున్న ప్రాంతం దగ్గర ఊరే. బహుశా యాదన్న కొడుకు ఆ దళంలోనే వుండి వుండొచ్చు, నాకర్థమైంది. పక్కన కూర్చున్నాను.

ఏం మాట్లాడాలో తోచలేదు. కాసేపలాగే కూర్చొని యాదన్న వీపుమీద చెయ్యేసి 'ఏంకాదులే పడుకో అన్నా' అని చెప్పి లేచి నా పక్క చేరుకున్నాను.

ఇక పూర్తిగా నిద్ర కరువైంది. ఆలోచనల్నిండా యాదన్నే!

భారంగా తెల్లారింది.

దాదాపు అందరి మొహాలు పీక్కుపోయే వున్నాయి. రాత్రి సరిగా నిద్రలేక, మెల్లగా దినచర్య మొదలైంది. కానీ అందరి చూపులూ బ్యారక్ గేటువైపే. ఇంకా రాని పేపరు కోసం. ఏదైనా సంఘటన జరిగినప్పుడో, సెన్సారు చెయ్యాల్సిన వార్తలేవైనా వున్నప్పుడో పేపరు ఆలస్యంగా వస్తుంది.

మా సహనం అసహనమై చిగురేస్తున్నప్పుడు ఎట్టకేలకు పేపరొచ్చింది. అందరం గుమిగూడి పోయాం దానిచుట్టూ.

మొదటి పేజీలోనే ఫొటోల్తో సహా వార్త.

'ఎన్‌కౌంటర్లో గిరాయిపల్లి దళం మొత్తం హతం'.

ఏడుగురు కామ్రేడ్స్‌ని అతి క్రూరంగా కాల్చి చంపేశారు.

ఓ కామ్రేడ్ పేపర్ని తీసుకుని ఆ వార్తను అందరికీ పెద్దగా చదివి విన్పించాడు. అందరం మ్రాన్పడిపోయి వింటున్నాం. ఇన్ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో షెల్టర్ తీసుకుంటున్న దళాన్ని చుట్టుముట్టి కిరాతకంగా కాల్చి చంపేశారు.

బిగ్గరగా ఏడ్పు వినిపించింది.

పేపరు పట్టుకుని యాదన్న బిగ్గరగా ఏడుస్తున్నాడు.

"అన్నా....నా కొడుకన్నా.... కిట్టయ్యన్నా...." భోరుమని రోదిస్తున్నాడు. అందరికీ గుండె చెరువైపోయింది.

యాదన్నను చూసి మరో పదిమంది కామ్రేడ్స్ బావురుమన్నారు. అందరి కళ్ళలో తడి. పేపర్లో అచ్చయిన తుపాకీగుళ్ళకి ఛిద్రమైన కొడుకు దేహం ఫొటోని తడుముతూ

"కొడకా.... కొడకా...." యాదన్న గుండెలు పగిలేలా ఏడుస్తున్నాడు.

"ఊకో అన్న ఊకో" మిగిలినవాళ్ళు ఓదార్చుతున్నారు.

కసి

కన్నీళ్ళు పెనుమంటలవుతున్న కసి.

కొడుకుని తండ్రికీ, తండ్రిని కొడుకుకీ, తల్లిని బిడ్డకీ, బిడ్డని తల్లికీ, ఒకళ్ళనొకళ్ళకీ లేకుండా చేస్తున్న ఈ హంతక వ్యవస్థమీద కసి.

అందరం బ్యారక్‌లో సమావేశమయ్యాం.

విషాదం, కసిల మధ్య ఎన్‌కౌంటర్లో అమరులయిన ఆ అమరవీరులకు జోహార్లు అర్పించాం. వాళ్ళగురించి పరిచయమున్న కామ్రేడ్స్ ఒక్కొక్కళ్ళే లేచి మాట్లాడుతున్నారు.

అందరి గుండెల్లో దుఃఖకెరటం.

అందరి గుండెల్లో కసి బడబానలం.

అందరిలో ఏదో చెయ్యాలన్న తపన. ఏమి చేయలేని నిస్సహాయత.

చివర్లో యాదన్న లేచాడు. కళ్ళు తుడుచుకుని దుఃఖంతో పూడుకుపోయిన గొంతు పెగుల్చుకుని-

"అన్నా! నేను కూలోడ్ని.... నాకేమీ తెల్వదు.... గదేదో సంఘమని పేదోల రాజ్జెంకోసం కొట్లాడనీకి పోతున్నని ఓనాడు గీ ముచ్చట చెప్పి పోయినాడు కొడుకు. గప్పుడు గా మాటలకర్థం తెల్వక నేను నోరెల్లబెడితే ఒకవ్వడు గివన్నీ నీకే సమజయితవన్నడు. సరే పోయిరా బిడ్డా అని నేనే పంపినా- గప్పుడు గా మాటలకు అర్థం తెల్వకున్నా గిప్పుడు బాగా సమజయింది. కిట్టయ్యొక్కడే నా బిడ్డగాడు జచ్చిపోయినోళ్ళంతా నా బిడ్డలే. కొట్లాడాలే.... ఎందుకు కొట్లాడాలో గిప్పుడు సమజయింది.... ఇక కొట్లాడాలే.... ఇంకా.... ఇంకా కొట్లాడాలే...." ఏడుస్తూ కుప్ప కూలిపోయాడు యాదన్న.

'యాదన్నా! యాదన్నా'

మా కన్నతండ్రీ!

అందరం వేదనతో మెలి తిరిగిపోయాం.

రెండ్రోజులదాకా ఆ విషాదం కమ్యూన్‌ని ఆవరించుకునే వుంది. మరుసటి రోజు పేపర్లో అమరుల అంత్యక్రియల వార్తలొచ్చాయి. వేలాదిమంది ప్రజలు అమరుల అంతిమ యాత్రల్లో పాల్గొని ఘనంగా నివాళు లర్పించారు.

కిట్టయ్య అంత్యక్రియలకు యాదన్నను పంపించాలని పిటీషన్ పెట్టి ప్రయత్నించాం. కానీ సాధ్యంకాలేదు. యాదన్నను, యాదన్న వేదనను చూస్తుంటే కత్తిపెట్టి కోస్తున్న బాధ, నిస్సహాయమైన కసి. కామ్రేడ్సందరూ యాదన్న బాధను పంచుకొని ఓదార్చి, కమ్యూన్ దినచర్యలో, సమూహంలో కలుపుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

అయినా ఓ వేదనామయ మౌనం.

రెండ్రోజుల తర్వాత

భోజనం చేసి మధ్యాహ్నం లీజర్ టైంలో బ్యారక్‌లో కూర్చొని చదువుకుంటున్నాను. నా దగ్గరకు యాదన్న వచ్చాడు. చేతిలో ఖాళీ ఇన్లాండ్ కవరుంది.

"అన్నా జాబు రాయాలే" అంటూ కూర్చున్నాడు.

కళ్ళచుట్టూ నలుపులో ఇంకిన దుఃఖం.

పెన్ను తీసుకుని 'చెప్పన్నా' అన్నాను.

"భార్యకు!

నీ భర్త ముషిరాబాద్ జైలునుండి రాయునది. ఎన్‌కౌంటర్ జరిగిన విషయం మాకు పేపర్లో తెల్సింది. నేనాడకు రాడానికి గీడ అన్నలు చాలా ప్రయత్నం చేసినారు. ఆదివారం కావడంవల్ల లాయర్లు అందుబాటులో లేకపోవడంవల్ల, వారు కాయితం తీసుకుని సంగారెడ్డికి పోయేలోపు మీరు కిట్టయ్యను తీసుకుపోయి దహనం చేసినారని తెల్సింది. అందుకని రాలేకపోయాను. మీరు ప్రయత్నం చేసుంటే దొరికెడిది. మన కొడుకు చనిపోయిండని బాధపడొద్దు. మనలాంటి పేదోళ్ళ కోసం పోరాడ్డానికి పోతానంటే మనమే సంఘంలోకి పంపినాం కందా! మన కొడుకే కాకుండా యింకా ఆరుగురు అన్నలు చనిపోయారు. వాళ్ళు మన కొడుకులు కారా! చనిపోయిన అక్క మన బిడ్డే కాదా వాళ్ళందరూ మన బిడ్డలే, పేదోళ్ళ కోసం పోరాడి పేదోళ్ళరాజ్యం తెమ్మని మన కొడుకుని పంపినప్పుడే మన కొడుకు చనిపోతాడని తెల్సు. గందుకే మనం బాధపడకూడదు. మనకోసం కాకుండా జనంకోసం మన కొడుకు చనిపోయిండు. మన కొడుక్కోసం మనమే కాకుండా చాలామంది తల్లిదండ్రులు కంటనీరు పెడ్తన్నరు. గది చూసి మనం గర్వపడాలె. నీవు ఏడ్వకు. నీవు ఏడిస్తే పిల్లలేడుస్తరు. గందుకని నీవు ధైర్యంగా వుండాలె. అవ్వకు, నాయనకు మీరందరూ కల్సి ధైర్యం చెప్పాలె. తమ్మున్కి విషయంజెప్పి ములాఖత్‌కు పంపు.

ఇట్లు
నీ భర్త
యాదన్న."

యాదన్న దుఃఖాన్ని, రందిని, నిస్వార్థాన్ని, త్యాగాన్ని యథాతథంగా అనువదించలేని నా భాషా నిస్సహాయతమీద రోత పుట్టింది.

అక్షరాలు కావివి కళ్ళనించి కారుతున్న నెత్తుటిబొట్లు.

అక్షరాలుకావివి గుండెనించి ఎగుస్తున్న బతుకుపోరు హోరు.

అక్షరాలనిండా నిస్వార్థ త్యాగం.

అక్షరాలనిండా వర్గప్రేమ.

అడ్రస్ రాసిచ్చి నీళ్ళతో నిండిన కళ్ళతో యాదన్నవైపు చూశాను.

ఇప్పుడు యాదన్న కళ్ళలో కన్నీళ్ళు లేవు, విషాదం లేదు, అమాయకత్వం లేదు, అసహాయత్వం లేదు. వాటి స్థానే ఏదో దృఢ నిశ్చయం. ఏదో గంభీరత్వం.

మెల్లగా, దృఢంగా అడుగులు వేసుకుంటూ వెళ్తున్న యాదన్న నాకిప్పుడు కేవలం ఓ కన్నతండ్రిలాగ కన్పడటం లేదు.

నిశ్చయంగా యాదన్నిప్పుడు-

ఓ కాకలుదీరిన ప్రజాసైనికుడు.

ఓ కమ్యూనిష్టు! ❑